ఇక శిల్ప సంగతి సరేసరి.

భార్యగా అతని మంచి చెడ్డల గురించిగాని, ఇంటి యజమానురాలుగా ఇంటి విషయాలుగాని పట్టించుకోకుండా సముద్రాన్ని చూస్తూనో, స్టీరియో వింటూనో, నిద్రపోతూనో పగలంతా గడిపేది.

ఒక్కోరోజు కిరీటి కంటికన్పడకుండా జాగ్రత్తపడేది.

ఓరోజు రాత్రి ఎనిమిది గంటల ప్రాంతంలో కిరీటి స్వయంగా ఆమె గదికి వచ్చాడు.

'ఓ సారిలా వస్తావా' అని పిలవగానే మాట్లాడకుండా అతని వెనుక నడచింది.

షాపింగ్ చేసుకు వచ్చిన గుర్తుగా పేకెట్సుతో చీరలు...

చీరలన్నింటినీ బయటికి తీస్తూ 'నీకోసం బాంబేనుండి ప్రత్యేకంగా తెప్పించాను' అన్నాడు ముక్తసరిగా.

నిజానికి అన్నీ ఖరీదైన చీరలే.... సగానికి పైగా ఆమెకు నచ్చిన డిజైన్సే....

అయినా ముఖంలో ఎటువంటి భావమూ కనిపించకూండా జాగ్రత్తపడింది.

ఆమె ప్రక్కనుండి ఏమాత్రమూ రెస్పాన్స్ లేక పోయేసరికి ఇబ్బందిగా నిలబడిపోయాడు.

'తీసి నీగదిలో పెట్టేయ్'

'ఇప్పుడు ఇవన్నీ ఎందుకు ?'

'నీకు అవసరమని'

'నా అవసరాల గురించి మీకెందుకు తాపత్రయం?'

'భార్యవని....'

'దురాశ....'

'ఎప్పటికైనా మారకపోవన్న ఆశ...'

'అది ఈ జన్మలో జరగదని చెప్పాను...'

'నేను ఆశావాదంతోనే జీవితంలో చాలా సాధించాను.'

'కానీ నా విషయంలో మీకు ఓటమి ఖాయం.'

'అదీ చూస్తాను...'

అతని ఆత్మ విశ్వాసం ఆమెకి అహంకారంలా అనిపించింది. నవ్వుతున్న అతని కళ్ళు ఆమె స్వాతిశయంపై గుచ్చుకుంటున్న ముళ్ళులా అనిపించాయి.

'శిల్పా.... చీరల విషయంలో ఇంత సీరియస్‌గా చర్చించుకోవటం షియర్ వేస్టాఫ్ టైమ్.'

'చీరలు కొనటం కూడా వేస్టే అన్నది నా అభిప్రాయం.'

'సండే ఈవినింగ్ 'సన్ అండ్ సీ'లో స్నేహితులకి మేరేజ్ పార్టీ ఇస్తున్నాను'

'....అందుకని నేనీ ఖరీదైన చీరల్ని కట్టుకొని అక్కడ మీముద్దుల భార్యగా కొంతసేపు నటించాలి.'

'సరిగ్గానే ఊహించావు...'

'కానీ మీ ఊహే సరికాదు...'

'అంటే...'

'మిమ్మల్ని అంతగా ద్వేషించే నేను అక్కడికి వస్తానని, వచ్చి మీభార్యగా నటిస్తానని ఎలా అనుకున్నారు.'

గొంతులో పచ్చి వెలక్కాయ పడినట్టుంది కిరీటికి.

అదిరించి బెదిరించి ప్రయోజనం లేదనుకున్నాడు.

'ప్లీజ్ శిల్పా...ఐ హావ్ కమిటెడ్...'

ఓరగా అతనివేపు చూసింది.

'నా దురదృష్టానికి ప్రపంచానికి తెలియపరిచే ప్రయత్నం చేయవద్దని నీకు ముందే చెప్పాను...' ఆర్ధ్రతగా అన్నాడు.

'మిమ్మల్ని చూస్తుంటే జాలిగా వుంది'

ఆమె ధోరణి అతనిని సహింపరానిదిగా వుంది... అయినా భరించాడు.

'అలాగే వస్తాను...... కాని ఒక్క షరతు..'

ఏమిటన్నట్టుగా చూసాడు.

'అక్కడ మీ ప్రవర్తన ఏమాత్రం శృతిమించకూడదు. ఐమీన్ నేను ఇష్టపడని రీతిలో మీరు ప్రవర్తించకూడదు.'

'కాని... అక్కడకు వచ్చే నాకు అత్యంత ఆత్మీయులయిన మిత్రులు. కాస్త ఈస్తటిక్‌గా బిహేవ్ చేయాలి.'

'నాపరంగా మీకెటువంటి బాధ కలగకుండా చూస్తాను.'

'నేను కూడా....'

బయటకు వెళ్ళబోతూ ఆగాడు.

'సండే ఈవినింగ్ ఆరుగంటలకు పార్టి.'

'చిన్న రిక్వెస్టు..'

ఈసారి వెళ్ళబోతూ ఆమె ఆగింది.

చెప్పాలా వద్దా అని కొన్ని క్షణాలు తటపటాయించాడు.

'నాకు మెరూన్ కలరంటే ఇష్టం...నీకు బాగా సూటవుతుందని కూడా నమ్మకం....'

ఆమె కట్టుకోవాల్సిన చీరగురించి పరోక్షంగా చెప్పి బయటకు వెళ్ళిపోయాడు.

8

వివిధభారతి వింటూ బెడ్‌పై పడుకున్న శిల్పకు ఆదివారమని కిరీటి స్నేహితులకు పార్టీ అరేంజ్ చెసింది అదే రోజన్న విషయం గుర్తుకొచ్చింది.

బెడ్‌పైనుండి లేచి షవర్‌బాత్ క్రింద మరోమారు స్నానం చేస్తూ ఆలోచించింది.

కిరీటి కోరినట్లు మెరూన్ కలర్ అమెరికన్ జార్జెట్ చీర కట్టుకోవటమా వద్దా అని

నిజానికి ఆ కలర్ తనకూ ఇష్టమే.

తనకిష్టమని ఆ చీర కట్టుకుంటే కిరీటి తన కోర్కెను మన్నించినట్టుగా ఫీలయితే.

అతనిలో అనవసరమైన ఆలోచనలకు తావిచ్చినట్టు అవుతుందేమో.

పోనీ పట్టు చీర మాత్రమే కదా. కట్టుకుని ఆపాటి సంతోషాన్ని కల్గిస్తే పోయేదేముంది.

నోనో... వీల్లేదు... ఆమెలోని అహంకారం ఆవేశంగా ఒళ్ళు విరుచుకుంది.

అలా చేస్తే ఆయనకు దాసోహమైనట్టుగా అవుతుంది.

ఆ ఆలోచన రాగానే నేరేడు రంగు క్రేంప్ సిల్క్ శారీ తీసింది. అదేరంగు బ్లౌజు వేసుకొని ఆరుగంటలకల్లా అలంకరణ పూర్తి చేసుకుంది.

ఆరుగంటలకి పార్టీ అన్న పెద్దమనిషి ఇంకా రాడేం అనుకుంటూ బడలికగా సోఫాలో కూర్చుంది.

బయట మరోగదిలో చీటికీ మాటికీ వాచీ చూసుకొంటూ కూర్చున్న కిరీటిలో అసహనం ఎక్కువగా కాసాగింది.

ఆరుగంటలకు అక్కడ ఉండాలని స్పష్టంగా చెప్పాడే.

ఇంకా బయటకు రాడేం....

ఒకవేళ మరచిపోయిందా...లేక మళ్ళీ అలకపాన్పు ఎక్కిందా?

మరోఅరగంటపాటు ఆలోచనల్లో గడిపిన కిరీటి ధైర్యం చేసి ఆమె గదికి వెళ్ళాడు.

గది తలుపులు తోయగానే ఉలిక్కిపడుతూ పైకి లేచింది శిల్ప.

ఆమెను చూడగానే తయారై తనకోసమే వెయిట్ చేస్తుందన్నమాట అనుకున్నాడు.

ఆమె కట్టుకున్న చీరను చూడగానే అతని ముఖంలో తారట్లాడిన నీలినీడల్ని ఆమె గమనించకపోలేదు.

బెంజ్ కారులో అతడి ప్రక్కనే కూర్చుంది.

కారులో వారి మధ్య ఎటువంటి చర్చ చోటు చేసుకోలేదు.

పసిపిల్లాడు ఉడికిపోయినట్టు ముఖంపెట్టిన కిరీటిని చూసి అతడు కోరినవిధంగా మెరూన్ కలర్ చీరకట్టుకునుండాల్సింది అనుకుంది.

కారు 'సన్ అండ్ సి' నీ చేరగానే వి.ఐ.పి. ని రిసీవ్ చేసుకున్నట్టుగా కిరీటిని స్నేహితులు ఉక్కిరి బిక్కిరి చేశారు.

ఖరీదైన కార్లను, ఖరీదైన మనుషులను దాటుకుంటూ వారి అభినందనల్ని అందుకుంటూ రూఫ్‌గార్డెన్ చేరుకున్నాడు.

అందమైన అల్యూమినేషన్‌తోనూ అందంగా పేర్చబడిన టేబుల్స్‌తోనూ, ఖరీదైన బొఖేలు, బహుమతులతోనూ అంతా సందడిగా ఉంది.

అక్కడ చేరిన ప్రతివ్యక్తికీ తనను కిరీటి పరిచయం చేస్తూంటే తీవిగా నమస్కారం చేస్తూ ఉండిపోయింది. కానీ వారు వేసే జోక్స్‌కిగానీ, వారంటున్న మాటలకి గానీ శిల్ప జవాబు

ఇవ్వలేదు.

'షి లుక్స్ ప్రెట్టీ...' అని కామెంట్ చేసిన ఒక భారీకాయుడ్ని 'హి ఈజ్ మిష్టర్ గజేంద్ర' అంటూ పరిచయం చేశాడు కిరీటి.

'మనిషికి తగ్గట్టు పేరు చక్కగా సూటయ్యింది' అనుకొంది కొర కొరమని చూస్తున్న అతడి చూపుల్ని చూస్తూ....

పురుషుల వరుస పూర్తికాగానే శిల్పను అధునాతనంగా అలంకరించుకున్న స్త్రీల దగ్గరకు తీసుకెళ్ళాడు.

కిరీటిని చాడగానే కృష్ణుణ్ణి చూసిన గోపికల్లా చుట్టుముట్టిన ఆడవారిపై శిల్పకు చెప్పరానంత కోపం వచ్చింది.

వాళ్ళు వేసే కాంమెంట్స్ మరీ ఏవగింపుగా వున్నాయి.

'హాయ్ కిట్టి....' అంటూ కిరీటిని కావలించుకున్నంత పని చేసిన స్త్రీని 'షి ఈజ్ జయశ్రీ' అంటూ శిల్పకు చూపించాడు.

వయసు దాచుకోవాలన్న వృధాప్రయత్నంతో చెంపలకు రోజ్‌పౌడర్, పెదవులకు లిప్‌స్టిక్ దండిగా పట్టించి ట్రాన్స్‌పరెంట్ చీరలో అంగాంగ ప్రదర్శన చేయటానికి వచ్చిన బాబ్డ్‌హెయిర్ భారతనారి అనుకుందామె.

ఎవరో పలకరించటంతో కిరీటి మగాళ్ళ మధ్యకు వెళ్ళి పోయాడు.

చుట్టూ చేరిన స్త్రీల ప్రశ్నల పరంపరను ఎదుర్కోవటం శిల్పకు కష్టమనిపించింది.

ఆడవాళ్ళరూపంలో ఉన్న అడవి మృగాల మధ్య తనను ఒంటరిగా వదిలిన కిరీటిపై చెప్పలేనంత కోపం వచ్చింది.

మరీ బిగుసుక్కూర్చోవటం భావ్యంకాదని తలచిన శిల్ప పెదవులకు నవ్వు కూడా అలంకారంగా పూసుకుని జయశ్రీ ప్రశ్నలకు సమాధానం చెబుతోంది.

దూరంగా పింక్ కలర్ ట్వీడ్ సూట్‌లో అందరిలో ఎంతో ఆకర్షణియంగా కనిపిస్తున్న కిరీటిని పదేపదే చూడకుండా ఉండలేకపోయింది.

మధ్య మధ్యలో తననే గమనిస్తున్న కిరీటి చూపుల్నుండి తప్పించుకుంటూ అందరిలో తనకంత ప్రత్యేకత నాపాదించిన అక్కడి వాతావరణాన్ని ద్వారా కొంత అహంకారాన్ని చల్లార్చుకోసాగింది.

'శిల్పా! యు ఆర్ రియల్లీ లక్కీ.'

కూల్‌డ్రింక్ సీప్‌చేస్తూ అసూయగా అంది జయశ్రీ.

'దేనికి?'

'కిరీటి లాంటి స్మార్ట్ యంగ్‌మాన్ని సునాయాసంగా కొట్టేసినందుకు....'తప్పని సరిగా నవ్వింది శిల్ప.

‘మీఆయన్నెవరూ ఎత్తుకు పోరులే... కాస్త మావైపు కూడా చూడు.’దొరికి పోయినట్టుగా గభాలున తల తిప్పుకుంది శిల్ప.

పగలబడి నవ్వింది జయశ్రీ ఒళ్ళంతా వూగేట్టు.

ఆమె మాట తీరు, ఆమె నవ్వు తున్న పద్ధతి వెగటు పుట్టించేట్టుగా వుంది...అయినా తమాయించుకుంది.

‘అన్నట్టు హనీమూన్ కెందుకెళ్ళలేదు...’

‘ఆయనకి కుదరక....’

నోటికొచ్చిన అబద్ధం ఆడేసింది.

‘నీ ప్లేస్‌లో నేనుంటే ఆరు నెలలు పాటు ఆఫీసుకెళ్ళనిచ్చే దాన్ని కాదు... హాయిగా ఏ స్విట్జర్లాండ్‌కో పోయి అక్కడే హాయిగా గడిపేసి మళ్ళీ పిల్లాడితో ఇండియా తిరిగొచ్చేదాన్ని.’

‘ఏంకల్చర్రా బాబూ... ఇంత పచ్చిగా మాట్లాడుతోంది’ అనుకుంది శిల్ప.

వదిలించుకోవాలని విశ్వప్రయత్నం చేస్తున్నా వీలు కాకపోవటంతో ఉస్సూమంటూ ఓ సోఫాలో చతికిలబడింది.

ప్రక్కనే కూర్చున్న జయశ్రీ శిల్పను ఆపాదమస్తకం పరికిస్తూ ‘కిరీటికి ఈ కలర్ నచ్చదే. ఈ శారీని ఎలా కట్టుకోనిచ్చాడబ్బా’ అంటూ క్యూరియస్‌గా అడిగింది.

‘ఒకరికి నచ్చక పోయినంత మాత్రాన నా పద్ధతుల్ని మార్చుకోను‘ అనబోయి ఆగిపోయింది.

‘అఫ్‌కోర్స్.... కిరీటి టేస్టు గురించి మీకు బాగా తెలుసనుకుంటాను.’ ఈర్ష్యగా అడిగింది.

‘కిరీటి టేస్టు గురించే మాత్రమే కాదు కిరీటి మొత్తం అఫైర్స్ గురించి నాకు తెలుసు. హి ఈజ్ రియల్లీ లవ్‌లీగే....‘

ఆమె అతి సాధారణంగా అన్నా మాటలు శిల్ప హృదయాంతరాళానికి తాకాయి.

ఏమిటి..... కిరీటికి అఫైర్సా....

ఆడతనం తెలుసుకోవాలని ఉవ్విళ్ళూరితే అహంకారం వద్దు పొమ్మంటోంది.

‘అవునట. నాకూ చెప్పారు. కానీ ఆ అమ్మాయి మాత్రం.....’

విషయాన్ని ఆరాతీయాలని అంతా తెలిసినట్టుగా చిన్న నాటకం ఆడింది.